విష్ణుకు నేను కృష్ణప్రసాద్ మాటల గురించి చెప్పకుండా బొమ్మ పగిలి చేతికి దెబ్బ తగలడం సంగతే చెప్పాను. కృష్ణ ప్రసాద్ కట్టు కట్టాడని చెబితే విష్ణు మొహంలో ఆశ్చర్యం, ఆనందం తళుక్కుమన్నాయి.

నీరజ భోజనానికి రమ్మని పిలిస్తే, మేం వెళ్ళేసరికి అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ఉన్నారు. నేను ఆ ఇంటికి వచ్చాక అలా అందరం భోజనానికి కూర్చోవటం అదే మొదటిసారి. శ్రీలక్ష్మి ఉన్నప్పుడు అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయడం అలవాటని తెలుసు. నేను వచ్చాక ఆ పద్ధతి పోయింది. ఎవరికి వారుగా చేస్తున్నారు.

కృష్ణప్రసాద్, నీరజ, చిన్నత్తయ్య, అందరూ సరదాగా మాట్లాడుతుంటే భోజనాలు కానివ్వటం విష్ణుకే కాదు, నాకూ చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా అనిపించింది. అందరిలా కబుర్లు చెప్పటం, నవ్వటం లేకపోయినా అత్తయ్య మొహంలో కనీకనిపించనట్లుగా చిరునవ్వు, కాంతీ కనిపించాయి. కృష్ణప్రసాద్ పెళ్ళి అయితే అత్తయ్యలో పూర్తిగా మార్పు వస్తుందేమో! ఇప్పటికే కొంచెం చురుగ్గా అనిపిస్తున్నారు. ఒక మేనకోడలి మరణంతో అత్తయ్య మనసులో ఏర్పడిన వెలితి ఇంకొక మేనకోడలు కోడలుగా రావటంతో తీరుతుందని అనిపించింది! ఇంట్లో వాళ్ళంతా మునుపటిలా ఉంటే నాలోని అపరాధ భావం కూడా క్రమేపీ తగ్గుతుందేమో... మరి!

* ❀ *

నాన్నగారి దగ్గర్నుండి ఫోను వచ్చింది.

విద్యార్థులకు చదువు చెప్పటమే కాకుండా వాళ్ళని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ప్రణాళికలతో నడపబడుతున్న నాన్నగారూ వాళ్ళ స్కూలును చూసిన ఒక గొప్పాయన ఉత్తర ప్రదేశ్‌లోని తన స్వగ్రామంలో కూడా అటువంటి విద్యాలయాన్ని నిర్మించాలని అనుకుంటున్నారట. నాన్నగారిని అక్కడకు వచ్చి కొన్నాళ్ళుండి స్కూలు నిర్మాణం, నిర్వహణా బాధ్యతలు తీసుకోమని ఆయన అభ్యర్థిస్తే కాదనలేకపోయానని చెప్పారు. కనీసం రెండేళ్ళయినా అక్కడ ఉండాల్సి వస్తుందనీ, నాన్నమ్మతో కలిసి వెళ్లే ఏర్పాట్లు మొదలు పెట్టానని చెప్పారు.

ఎపుడైనా వైజాగ్ రావాలనుకుంటే ఇంట్లో ఉండొచ్చనీ, తాళాలు రామబ్రహ్మం అంకుల్ ఇంట్లో ఇచ్చి అప్పుడప్పుడూ శుభ్రం చేయించే ఏర్పాటు చేశాననీ అన్నారు.

విషయం వినగానే చాలా దిగులనిపించింది. నేను ఇక్కడికి వచ్చాక నేనూ ఇంటికి వెళ్లలేదు. శ్రీనిలయానికి నాన్నగారు వాళ్ళూ రాలేదు. ఇంటికి వెళ్తే.. నాన్నగారికి అబద్ధమూ చెప్పలేను. అలాగని నిజాలు చెప్పలేను! అత్తయ్య ఇప్పటి వరకూ నాతో మాట్లాడలేదని తెలిస్తే తన జీవితంలోని సమస్యలే నాకూ ఎదురయ్యాయని అనవసర భయాల్తో బాధపడతారు. నాన్నగారు ఇక్కడికి వచ్చినా అదే సమస్య. అత్తయ్యా వాళ్లు పలుకరిస్తారో లేదో తెలియదు.

"ఇక్కడకు రాకుండానే వెళ్ళిపోతున్నారేం నాన్నా.." అని అడిగానే గానీ, "వచ్చి వెళ్ళాల్సిందే" అని ఖచ్చితంగా చెప్పలేకపోయాను. నా పరిస్థితి ఏమిటో చిత్రంగా ఉందనిపించింది!

అక్కడికి వెళ్ళాక, కొంచెం స్థిమితపడగానే తెలియజేస్తాననీ, అప్పుడు మేమిద్దరం వస్తే కొత్త ప్రదేశాలు చూసినట్లుగానూ ఉంటుందని నాన్నగారు అంటే... అప్పటికి అలాగేనని సమాధానం చెప్పాను.

❊ ❀ ❊

"ఎవరమ్మా నువ్వు... కొత్తగా చేరావా... పనిమధ్యలో ఆపేసి పుస్తకాలు తిరగేస్తున్నావేంటీ..?" పదునుగా వచ్చిన ఆ ప్రశ్నకి ఉలిక్కిపడి పక్కకు చూశాను.

ఎవరో పంచెకట్టు పెద్దమనిషి గుమ్మం దగ్గర నిలబడి ఉన్నారు.

శ్రీలక్ష్మికీ, అత్తయ్యకూ పుస్తకాలు చదివే అలవాటు ఉందని, లైబ్రెరీ రూములోని పుస్తకాల్లో నీక్కావలసినవి ఉన్నాయెమో చూసుకోమని విష్ణు ఆ మధ్య చెప్పిన మాటలు

గుర్తుకొచ్చి లైబ్రెరీ రూముకి వచ్చాను. మునుపు అత్తయ్య ఉండే గదికి పక్కనే ఉంది. పనిలో పనిగా పుస్తకాలు క్రింద పెట్టి, నేనూ నేల మీద కూర్చుని పుస్తకాల దుమ్ము దులుపుతూ నేను చదవాలనుకున్నవి వేరే పెడుతున్నాను. కొన్ని పుస్తకాలను తిరగేస్తూ.. లీనమై పోయి నేను ఆయన రాకను గమనించలేదు.

ఎక్కడో చూసినట్లున్నానే అని ఒక క్షణం ఆలోచించగానే గుర్తుకు వచ్చింది. నీరజ చూపించిన శ్రీలక్ష్మి ఆల్బమ్‌లో చూశాను! 'శ్రీలక్ష్మి తండ్రి... విష్ణు మామయ్య కోదండంగారని ఊహించాను. ఆయన నిజంగానే పొరబడ్డారా... కావాలనే అలా అడిగారా..? ఏమో మరి!

ఆయన వేపు చిరునవ్వుతో చూసి "మీరెవరో నాకు తెలియకపోయినా... మా ఇంటి లోపల వరకూ వచ్చారంటే.. దగ్గిర బంధువులే అయి ఉంటారు.. అవునాండీ..?" అడిగాను.

ఆయన ఆశ్చర్యంగా మొహం పెట్టి, "మా ఇల్లు అంటున్నావు... అంటే.. విష్ణు భార్యవా.. పొరబడ్డానమ్మా..." అంటూ పెద్దగా నవ్వి, అక్కడున్న స్టూలును లాక్కుని కూర్చున్నారు.

"బంధుమిత్రులందర్నీ పిలిచి అందరి మధ్యా పెళ్ళిళ్ళు చేయాలనే నియమం పెద్దలు ఎందుకు పెట్టారో ఇప్పుడు బాగా అర్థం అయింది! అందరి ఆశీర్వచనాలు అందుకోవటానికే కాకుండా, మా అల్లుడు.. మా కోడలు అని పరిచయం చేసినట్లుగానూ ఉంటుంది కదా! మీరేమో ఎవరూ అవసరం లేదన్నట్లుగా మీరే పెళ్ళి చేసుకుని చక్కా వచ్చేశారు. ఇంటికి కొత్తగా వచ్చిన నా బోటివాడు ఇంటి కోడల్ని ఎవరో అనుకుని పొరబడడంలో.. తప్పేముందీ.. కరెక్టే కదమ్మా..?"

"మీరు చెప్పింది నిజమేననుకోండి. కానీ పెళ్ళికి అందరూ రాలేకపోవచ్చు కూడా కదా! అలా రాలేకపోయిన మీలాంటి బంధువులెవరైనా ఇంటికి వస్తే.. కొత్త కోడలు ఎవరో ఏమిటో తెలుసుకోకుండా గుమ్మం దగ్గరే 'ఏదైనా పని కోసం వచ్చారా.. ఏంలేదు' అని తొందరపడి మాట్లాడేస్తే... అది తప్పకుండా తప్పే అవుతుంది... కరెక్టే కదండీ..?" వినయంగానే అడిగాను.

నా మాటలు చురుక్కుమనిపించాయని ఆయన మొహం చూస్తుంటేనే తెలిసిపోతోంది. కానీ ఆ సంగతి బయటపడకుండా పెద్దగా నవ్వేశారు. "నువ్వన్నది

నిజమేనమ్మా.. కానీ.. నువ్వు తెలుసుకోవల్సిన విషయం ఒకటుంది. పెద్దింటి వాళ్ళకి పనులు చేయించుకునే దర్పం, ఠీవి ఉంటాయి! వాళ్ళే స్వయంగా చేసుకునే అలవాటు ఉండదు. అందువల్లనే నేను పొరబడ్డాను. తప్పు పూర్తిగా నాదే కాదు. కరెక్టే కదూ.. నువ్వు బాగా నొచ్చుకున్నట్లున్నావు. పొరపాటని చెప్పా కదమ్మా..” ఆయన గొంతులో అనునయం ఎందుకోగానీ నాకు అభినయంలా అనిపించింది.

నేను చిన్న కుటుంబం నుండి వచ్చిన దానిని కాబట్టి గొప్పింటి వాళ్ళ పద్ధతులు, దర్జా నాకు తెలియవని ఎత్తి చూపటం కాబోలు! కొందరికి వగచినట్లు, వాతపెట్టినట్లూ కూడా మాట్లాడగల నైపుణ్యం ఉంటుంది! ఎదుటివాళ్ళు గుర్తించలేదని అనుకుంటారేమో కానీ తెలిసిపోతూంటుంది! ఈ ధోరణి అప్పుడు ఊరునుంచి వచ్చిన బంధువుల్లోనూ కనిపించింది. వాళ్ళు ఈయనకీ బంధువులేగా మరి!

నేనూ చిరునవ్వుతో ఆయన దారిలోకే వెళ్ళి సమాధానం చెప్పాను. “మీరన్నది నిజమే బాబాయ్ గారూ.. కానీ.. ఎంత గొప్ప వాళ్ళకైనా పని చేయించుకునే దర్జాతో పాటు అవసరమైనప్పుడు స్వయంగా చేసుకోగలిగే సత్తా కూడా ఉండాలి! అసలు పని చేయటం వచ్చినవాళ్ళకే బాగా పని చేయించుకోగలగటమూ తెలుస్తుంది. నన్ను పని మనిషిగా మీరు పొరబడినందుకు నేను నొచ్చుకున్నాననుకుని మీరు మళ్ళీ పొరబడ్డారు! పని తప్పించుకోవటంలో తప్పు ఉంటుంది. గానీ ఏ పని అయినా చేయడంలో గౌరవం తప్ప అమర్యాద ఉండదని నేను అనుకుంటాను..! అందుకే ఎవరైనా నన్ను పనిమనిషిగా పొరబడితే.. బాధపడను! పని.. చేసే మనిషికే విలువుంది! పనీ పాటా లేని మనిషిగానో.. పనికి మాలిన మనిషిగానో అనిపించుకుంటేనే నొచ్చుకోవాలి... కరెక్టే కదండీ..?”

ఆయన మొహం నల్లబడింది. కొంచెం విసురుగా ఏదో అనబోయి.. తమాయించుకొని పెదవులపైకి చిరునవ్వును రప్పించారు. లౌక్యం తెలిసిన మనిషిలా ఉన్నారు! ఏదో మాట్లాడబోతుండగా అక్కడికి కృష్ణ ప్రసాద్ వచ్చి, “నువ్వెప్పుడు వచ్చావ్ మామయ్యా...?” అని పలుకరించాడు.

“ఇదిగో.. ఇప్పుడే.. పెళ్ళి ఏర్పాట్ల గురించి నీతో మాట్లాడదామని వస్తోంటే విష్ణు భార్యని నేను చూడలేదుగా, పలుకరిస్తున్నాను. మనవాడెందుకు పడిపోయాడో ఇపుడు నా కర్థమైందిరా! అమ్మాయికి మాటల చమత్కారం చా.. లా.. ఉంది! ఒక ప్రశ్నకి రెండు జవాబులు...!” ఏదో జోక్ చెప్పినట్లుగా నవ్వారు.

కృష్ణప్రసాద్ కనబొమలెగురవేస్తూ నవ్వు మొహంతో “మా వదినా.. మజాకానా.. జాగ్రత్తగా మాట్లాడు మరి.. ” అని తర్వాత ఎందుకోగానీ నిట్టూర్చాడు. “పెళ్ళి.. పనుల్లో.. నా ప్రమేయం ఏమీ లేదు! అంతా అమ్మ ఇష్టప్రకారమే జరుగుతోంది.. అదే జరగాలి! అమ్మతో మాట్లాడితే సరిపోతుంది. నాకు పని ఉంది. బయటకు వెళ్తున్నాను...” అంటూ చకచకా వెళ్ళిపోయాడు.

కోదండంగారు కూడా బరువుగా నిట్టూర్చారు.

“ఇప్పుడు నాకు చాలా సంతృప్తిగా ఉందమ్మా! అందరూ నీ గురించి ఏదో అంటోంటే.. నీ తప్పేం ఉందని నేను బాధపడిన మాట నిజం! మా అమ్మాయి చేసిన తొందరపాటు పనికి నిన్ను తప్పు పట్టటం ఏ సబబు... నేను అందరితో అదే అన్నాను కూడా! ఇంట్లో వాళ్ళు కూడా నిన్ను దూరం పెట్టారని తెలిసి... నేనెంత బాధపడ్డానో నాకే తెలుసు. ఇప్పుడు చూస్తుంటే... ఇంట్లో వాళ్ళు నిన్ను తమలో కలుపుకున్నట్లే ఉంది... అందుకే నాకు సంతోషంగా ఉందంటున్నాను! నువ్వు నాకు కూతురివేనమ్మా.. నన్ను ఆప్యాయంగా బాబాయ్ గారంటూ పిలిచావ్.. అదీ సంతోషమే! నువ్వే పెద్దరికంతో ఈ ఇంట్లో పెళ్ళి పనులన్నీ చక్కబెట్టాలమ్మా!” ఆయన గొంతులోకి దుఃఖపు జీర వచ్చింది.

ఆయన మెల్లగా అడుగులు వేస్తూ వెళ్తుంటే... నేను నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడిపోయాను. ఆయన పట్ల సానుభూతితో నా మనసు ఆర్ద్రమైంది! కన్న కూతుర్ని పోగొట్టుకున్న ఆయన వ్యథ నాకు అర్థమైంది. ఆయన కూతురి స్థానంలోకి వచ్చిన నన్ను చూడగానే మాటల్లో కొంచెం వ్యంగ్యం, ఎత్తి పొడుపు, వచ్చి ఉండవచ్చు. అయినా ఆయన బాధ సహజమే, న్యాయమే అనిపించిందా క్షణంలో. నేనే ఆయన పరిస్థితిని అర్థం చేసుకోకుండా కొంచెం అతిశయంగా మాట్లాడానా అని మథనపడ్డాను.

❋ ❀ ❋

విష్ణు ఫోన్ చేసి కాసేపట్లో ఇంటికి వస్తున్నానని, బయటకు వెళ్ళాలి కాబట్టి రెడీగా ఉండమని చెప్పారు. ఎక్కడకు ఏమిటి చెప్పలేదు. హడావుడిగా చెప్పేసి ఫోను పెట్టేశారు.

వచ్చిన వెంటనే “బయలుదేరు” అంటూ తొందరపెట్టారే కానీ ఎక్కడి కంటే చెప్పలేదు. “తొందరెందుకు.. తెలుస్తుందిగా” అనేశారు.

ఇద్దరం కలిసి బయటకు వెళ్తుంటే.. చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా అనిపించింది. మేం సరదాగా బయటకు వెళ్ళిన సందర్భాలు చాలా తక్కువ. అసలే విష్ణుకు తీరిక ఉండడం లేదు. అందుకనే తన పరిస్థితిని అర్థం చేసుకుని ఎక్కడి కైనా వెళ్ళాలనే ప్రోగ్రాములు నేనూ పెట్టలేదు.

కారు స్టేషన్ ముందు ఆగింది. "మీ ఫ్రెండ్స్ ఎవరినైనా రిసీవ్ చేసుకోవాలా.. లేక వీడ్కోలు చెప్పటానికా..?" నా ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండానే విష్ణు వడివడిగా వెళ్తోంటే నేనూ తనని అనుసరించాను.

ఇద్దరం ప్లాట్‌ఫారమ్ మీద నిలబడ్డాం. ఏదో ట్రైను అనౌన్స్‌మెంట్ వినిపించింది. విష్ణు ఎవరు వచ్చేది ఏమిటి చెప్పకుండా సస్పెన్సులో పెట్టాలనుకుంటున్నారు. తన ఫ్రెండ్స్ ఎవరో నాకు తెలియని వాళ్లు వస్తుంటే నాకేం థ్రిల్‌గా ఉంటుందీ అని మనసులోనే అనుకున్నాను.

విష్ణు రెండు మూడు సార్లు తన రిస్ట్‌వాచ్‌లో టైము చూసుకుంటుంటే... ఎవరో బాగా ముఖ్యమైన వాళ్ళే అయివుంటారనిపించింది.

అయిదు నిమిషాల్లోనే ట్రైను వచ్చి ఆగింది.

యధాలాపంగా అటూ ఇటూ చూస్తూ నిలబడిన నేను సరిగ్గా ఎదురుగా ఉన్న కంపార్ట్‌మెంట్‌లో నుండి దిగుతున్న వాళ్ళని చూసి షాకయిపోయాను!

నాన్నమ్మ, నాన్నగారు!

ఆనందంతో కెవ్వున అరిచినంత పనిచేసి దగ్గరకు వెళ్ళి వాళ్ళిద్దరినీ చేతులతో చుట్టేశాను.

నాన్నగారు, నాన్నమ్మ ఉత్తరప్రదేశ్‌కి వెళ్తామని చెప్పి వారంరోజులైనా కాలేదు. అప్పుడే బయలు దేరి వెళ్లిపోతున్నారట, మమ్మల్ని ఇక్కడ కలుసుకోవటం కోసమే ఆ ట్రైనులో వచ్చామని చెప్పారు. ఇంకొక గంటలోనే వాళ్ళు మళ్ళీ ఎక్కాల్సిన రైలు ఉంది. ఇలా బయలుదేరి వస్తున్న విషయం నాన్నగారు విష్ణుకు రెండు రోజుల క్రితమే చెప్పారట. నాకు మళ్ళీ ఫోన్ చేసి చెప్పవద్దని విష్ణు అనటంతో నాన్నగారిక నాకు చేయలేదు.

నిజంగానే నాకు వాళ్ళిద్దర్నీ చూడగానే చాలా థ్రిల్లనిపించింది! కళ్ళమ్మట నీళ్ళు వచ్చేశాయి. అందరం వెయిటింగ్ రూములో కూర్చున్నాం. నేను వాళ్ళిద్దరి మధ్యా

కూర్చుని కుశల ప్రశ్నలు వేస్తూ హుషారుగా కబుర్లు చెప్పేస్తుంటే విష్ణు చిరునవ్వుతో చూస్తూ కూర్చున్నారు.

ఇక వెళ్ళాలని నిర్ణయించుకున్నాక ఆలస్యమెందుకని హడావుడిగా ఏర్పాట్లు చేసేసుకున్నామని నాన్నగారు చెప్పారు. మమ్మల్నిద్దర్నీ మార్చి మార్చి చూసి నాన్నగారు "నాకు చాలా సంతోషంగా ఉందమ్మా!" అన్నారు. నాక్కావలసిందీ అదే! నాన్నగారు నా గురించి ఏ మాత్రం బాధపడకూడదనే నేనూ నిజాలన్నీ నాన్నగారికి తెలియకుండా ప్రయత్నం చేస్తున్నాను. ఎప్పటికైనా ఈ పరిస్థితి మారుతుందనే నమ్మకం నాకుంది.

నాన్నమ్మ కొంచెంగా నా మీదకు ఒంగి గుసగుసగా అడిగింది. "మీ అత్తగారు వాళ్ళు నిన్ను బాగానే చూసుకుంటూన్నారా.. నీతో బాగానే ఉంటారా?"

"బ్రహ్మాండంగా చూసుకుంటున్నారు. నీలా 'ఇది... తిను... అది చెయ్యకు' అంటూ సతాయించే వాళ్ళెవరూ లేరిక్కడ. అంతా నా ఇష్టమే తెలుసా!" సరదాగా వెక్కిరిస్తున్నట్లుగా అన్నాను. మనసులో మాత్రం మాటలే లేకపోతే సతాయించే సమస్యేముంటుందీ అనుకుంటూ నిట్టూర్చాను.

నాన్నమ్మ ఆనందంగా నవ్వేసింది.

నాన్నమ్మ విష్ణును పరికించి చూస్తుంటే "ఏమిటీ మనవరాలిని వదిలేసి చందమామను అంతలా చూస్తున్నావ్?" ఆటపట్టిస్తున్నట్లుగా అడిగాను. విష్ణు మొదటిసారి మా ఇంటికి వచ్చినప్పుడు అబ్బాయి చందమామలా ఉన్నాడు అని అనడం అప్పుడు గుర్తుకు వచ్చింది.

విడిచి వెళ్ళిన చాలా సేపటి తర్వాత తిరిగి వచ్చిన తల్లి చుట్టూ హుషారుగా చిందులేసే లేగదూడలా మారిపోయింది నా మనసు!

ఆ క్షణాలలో.. హుషారైన బాల్యం నన్నావహించిన అనుభూతి కలిగింది!

వాళ్ళిద్దర్నీ ట్రైను ఎక్కించాక తిరిగి వస్తున్నప్పుడు కారులో కూర్చోగానే విష్ణు అరచేతిని ఇష్టంగా పెదవులకానించుకున్నాను థేంక్స్ చెబుతున్నట్లుగా.

విష్ణు చిరునవ్వుతో నా తల మీద తట్టారు. అలవాటు ప్రకారం వెల్‌కమ్ అనో, నెవర్‌మైండో అనో విష్ణు చెప్పే పద్ధతి అది!

* ❀ *

పెళ్ళి పనులు కొంచెం జోరందుకున్నాయి.

అత్తయ్య, చిన్నత్తయ్య, నీరజ, ఇంకెవరో బంధువులు కలిసి, విడివిడిగానూ షాపింగు చేస్తున్నారు. నగల షాపుకి వెళ్ళేటప్పుడు ఒకటి రెండు సార్లు నీరజ నన్ను "వస్తావా?" అనడిగింది.

అది నాకేమీ తెలియని సబ్జెక్టు. ఆపైన ఆసక్తీ లేదు. అందుకే రానని చెప్పేశాను. ఆ తర్వాత తను కూడా మళ్ళీ అడగలేదు.

## 10

పెళ్ళి దగ్గరకు వస్తోందని ప్రయాణానికి నేనూ ఒక చిన్నసూట్‌కేసులో నా బట్టల్ని ముందుగానే సర్ది పెట్టేశాను.

రిజిస్ట్రారు ఆఫీసులో మా పెళ్ళి జరిగిన రోజున నాలుగు వేళ్ళ వెడల్పున జరీ అంచుతో అక్కడక్కడా బుటా ఉండే మెరూన్ కలర్ పట్టుచీర కట్టుకున్నాను. పెళ్ళికని నాన్నగారు కొన్న చాలా సింపుల్‌గా ఉండే ఎర్రరాళ్ళ నెక్లెసు పెట్టుకున్నాను.

ఆ రోజు ఇంటికి వచ్చాక విష్ణు నాతో "ఈ రోజు నువ్వెంత అందంగా ఉన్నావో తెలుసా! కొంతమంది ఆడవాళ్లు పెట్టుకున్న నగల్ని చూస్తే ప్రదర్శన కోసమే అనిపిస్తుంది! ఇప్పుడు నిన్ను చూస్తుంటే అలంకరణకీ అవి ఇంత బాగా ఉపయోగపడతాయా అనిపించింది!" అన్నారు.

ఆ చీరను సూట్‌కేసులో పెడుతూంటే విష్ణు మాటలు గుర్తుకొచ్చాయి.

కొన్ని జ్ఞాపకాలు మనసులో అలా పదిలంగా ఉండిపోయి, అప్పుడప్పుడు అలల్లా ఎగిసిపడి ఆనందంలో ముంచెత్తుతాయి! నెమరు వేసుకోవటంలోని తీయదనం అదే!

❈ ❀ ❈

ఆరోజు.. నేను మెట్లు దిగి క్రిందకు రాబోతుంటే క్రింద హాల్లో మాట్లాడుకుంటున్న వాళ్ళ మాటల్లో నా ప్రసక్తి వినిపించి అప్రయత్నంగా ఆగిపోయాను.

"ఇంటికి పెద్ద కోడలు.. పెళ్ళికి రాకుండా ఉండటం ఏం బావుంటుంది? పద్ధతిగా ఉండదు. వదిన అంటోంది సరే, నీ మాట ఏమిటి?" అవి అత్తయ్య మాటలు.

చిన్నత్తయ్య వెంటనే అందుకున్నారు. "సరేలే వేరేగా చెప్పేదేముందీ.. కంకణాల చెయ్యి ఆడితే కడియాల చెయ్యా ఆడుతుంది!"

కోదండంగారి గొంతు వినబడింది. "నేనంటే మొండివాడిని కాబట్టి ఇలా తిరగ గలుగుతున్నాను. కానీ... మీ వదిన ఇన్నాళ్ళయినా ఈ ఇంట్లో అడుగుపెట్టిందీ? అంత పంతం ఉంది! అక్కడ ఆ అమ్మాయిని చూసి ..కూతురు గుర్తుకొచ్చి పెళ్లి పందింట్లో ఏం గొడవ చేస్తుందోననే నా భయం తప్ప నాదేం లేదు మీనాక్షీ..."

ఆ చర్చ నేను పెళ్ళికి రావటం గురించేనని నిముషంలోనే అర్థమైపోయింది. వాళ్ళ మధ్యకు వెళ్ళటం ఇష్టం లేక మళ్లీ వెనుదిరిగాను. నన్ను వాళ్ళు గమనించినట్లున్నారు కాబోలు.

"కాగల కార్యం గంధర్వులే తీర్చారన్నట్లుగా సరిపోయింది.. " చిన్నత్తయ్య మాటలు మళ్ళీ మెల్లగా వినిపించాయి.

పెళ్ళికి నేను రావటం విష్ణు వాళ్ళ అత్తయ్యకు ఇష్టం లేదనే సంగతి ప్రత్యేకంగా నాకు చెప్పక్కర్లేకుండా నేనే వాళ్ళ మాటల్ని విని తెలుసుకోగలిగానని అర్థం అయి ఉంటుంది!

మనసు చివుక్కుమంది! కళ్ళు చెమర్చాయి.

ఏదయినా పొరపాటుగానీ, శ్రీలక్ష్మికి అన్యాయం గాని జరిగి ఉంటే అది విష్ణు వలనే గానీ నా వల్ల కాదుగా...?! విష్ణును చూస్తే కలగని బాధ, కోపం.. నన్ను చూస్తే ఎందుకు వస్తాయి? విచిత్రంగా ఉంది!

ఒకప్పుడు "కోడలా?" అని నన్ను గురించి అడిగిన ప్రశ్నకి అవుననకుండా "విష్ణుభార్య" అని సమాధానమిచ్చిన అత్తయ్య ఇప్పుడు తనంతటతానుగా "పెద్దకోడలు" అంటూ మాట్లాడడం నాకు ఆశ్చర్యంగా, ఆనందంగా అనిపించింది! నాకు ఎదురయ్యే ప్రతి అవమానకర సంఘటనలోనూ ఆనందించే అంశాన్ని వెతుక్కుంటున్నాను! మంచిదేగా అనుకుంటూ నిట్టూర్చాను!

పెళ్ళికి నేనురావటం లేదని చెప్పేసరికి విష్ణు "అదేం?" అంటూ పదే పదే ఆరా తీశారు. నేనే ఏదో చెప్పబోతుంటే వినిపించుకోలేదు. "ఎవరో అన్న మాటల్ని చెప్పాననేగా తమ్ముడు అన్నాడు. దానికి నువ్వింకా బాధ పడుతున్నావా?" అనడిగారు.

"ఛ...ఛ.. అదేంకాదు.." అంటూ వెంటనే తల అడ్డంగా ఊపాను.

చేతికి దెబ్బ తగిలిన రోజున కృష్ణప్రసాద్ మాటల గురించి నేనైతే విష్ణుకు చెప్పలేదు. బహుశా అత్తయ్య, నీరజ, చిన్నత్తయ్య.. ఎవరో ఒకరు చెప్పి ఉండొచ్చు.

"అవి తన ఉద్దేశాలు కావని కృష్ణప్రసాద్ స్పష్టంగా చెప్పినా నేనెందుకు బాధపడతాను? ఒక వేళ కృష్ణప్రసాద్ అభిప్రాయాలే అయితే నేను బాధపడతానేమోననే విషయాన్ని పట్టించుకునేవాడు కాదు. "వింటే ఏంలే.." అనుకుని ఊరుకునే వాడు. అలా కాకుండా వెంటనే వచ్చి చిన్నతనం అనుకోకుండా క్షమాపణ అడిగాడు. నేను నొచ్చుకోకూడదనేగా... అంత ప్రాధాన్యం ఇచ్చినందుకు నాకు నిజంగా సంతోషమే కలిగింది!"

"మరి.. ఎందుకు రానంటున్నావు? తమ్ముడు గొడవ చేయడూ..?"

"వస్తేనే అక్కడ పందిట్లో గొడవ జరగవచ్చని అంటున్నారు!" అప్రయత్నంగా అనేశాను. ఇంకెందుకని నేనే కోదండంగారి మాటల గురించి క్లుప్తంగా చెప్పాను.

విష్ణు మౌనంగా ఉండిపోయారు.

"పెళ్ళి అంటే... నలుగురూ కలిసి చేసేది. మన ఇష్టప్రకారమే జరగదు. అందరి అభిప్రాయాల్నీ పట్టించుకోవాలి! పెళ్ళికూతురు వాళ్లు వచ్చే సమయానికి నేను ఇంట్లో ఉండి ఏర్పాట్లు గురించి చూసుకోవాల్సి ఉందని అనుకుంటే సరిపోతుందిగా... అంత ఆలోచనెందుకూ...?" అన్నాను.

ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఉండిపోయిన విష్ణు 'నిజమే' అన్నట్టుగా తలూపారు.

❊ ❀ ❊

పెళ్ళి ఏర్పాట్లు భారీగా, ఘనంగా జరిగిపోయాయి.

శ్రీనిలయం అంతా ధగధగలాడిపోయేట్లుగా లైటింగ్ ఏర్పాటు జరిగింది. ఒక పెళ్ళి జరగటానికి ఇ..న్ని... రోజులు..ఇం..త మంది శ్రమపడటం, ఇం..త ఖర్చు అవసరమా అనిపించింది. ఒక్కొక్కరి అభిరుచి, ఆసక్తి ఒక్కో రకంగా ఉంటాయి! కొందరికి అవసరం అనిపిస్తే, కొందరికి అనవసరం అనిపిస్తుంది కాబోలు!

ఏమైనా కృష్ణప్రసాద్ పెళ్ళి ఇలాగే జరగాలి! లేకపోతే అత్తయ్య మనుసులోని అసంతృప్తి ఎప్పటికీ అలాగే ఉండిపోతుంది. అత్తయ్య ముఖంలో మునుపటి నిర్లిప్తత, విషాద ఛాయలు తగ్గటాన్ని గమనించాను.

ఇంటికి ఎవరెవరో బంధువులు వస్తున్నారు. నేను నా గదికే ఎక్కువగా పరిమితమైపోవటం ద్వారా కొత్త వాళ్ళ చూపుల్నీ, ఆరాల్నీ కొంత మేర తప్పించుకోగలిగాను.

మా పెళ్ళి శ్రీలక్ష్మి మరణానికి కారణమనే నిందాభారం నా మీద లేకపోయి ఉంటే నేనూ ఈ పెళ్ళి హడావుడిలో, సంరంభంలో ఆనందంగా పాలు పంచుకునేదాన్నేమో!

ఎవరో ఇద్దరు ముగ్గురు బంధువులు మాత్రం ఇంట్లో ఉండిపోయారు. మిగతా అందరు పెళ్ళికొడుకుతో కలిసి నెల్లూరుకు తరలి వెళ్తున్నారు. ఒకటే కోలాహలం.

అలంకరణలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న శ్రీనిలయం ముందు... బారులు తీరిన కార్లలో అంతా సర్దుకున్నారు.

కార్లన్నీ వరుసగా కదిలి వెళ్తోంటే.. బాల్కనిలో నిలబడి చూశాను. ఒం..ట..రి..గా!

❊ ❀ ❊

మరునాడు సాయంకాలం...

ఇంటికి ఒక పక్కగా ప్రహారీ గోడకి ఆనుకుని రంగు రంగు గులాబీ మొక్కల గుబుర్లు ఉన్నాయి. అక్కడే కూర్చోవటానికి ఒక సిమెంట్ బెంచీ ఉంది. ఇంటిలో ఒక్కదాన్నీ గదిలో ఉండటం కంటే కాసేపు మొక్కల మధ్య కూర్చోవాలనిపించింది.

ఆ రాత్రి ఎనిమిదిగంటలకే కృష్ణప్రసాద్ పెళ్ళి ముహూర్తం. ఇప్పుడక్కడ అందరూ ఎంత సందడిగా, హడావుడిగా ఉండి ఉంటారో ఆలోచిస్తూ కూర్చున్నాను.

కాసేపటికి చల్లగాలి మనసును పెళ్ళి ఆలోచనల నుండి మళ్ళించింది.

ఆ చల్లగాలి ఒంటరిగా ఉన్న నన్ను ఆప్యాయంగా స్పృశిస్తున్నట్లు... విరిసిన గులాబీలన్నీ నా వేపే చూస్తూ నన్ను మురిపిస్తున్నట్లూ.. కదులుతున్న ఆకులు గలగలమని కబుర్లు చెబుతున్నట్లూ... చాలా హాయిగా, సాంత్వనగా ఉంది!

అప్పుడే ముందు వేపు గేటు తలుపు తీసుకుని శంకరం లోపలకు రావటం చూశాను. సాధారణంగా వాళ్ళు అవుట్ హౌవుస్‌కి పక్కనుండే చిన్న గేటు నుండి అటు వేపు వీధిలోకి రాకపోకలు చేస్తుంటారు. ఎప్పుడైనా ముందువేపు వీధికి దగ్గరగా ఉండే చోట్లకి వెళ్ళి వస్తున్నప్పుడే ఈ గేటులో నుండి వస్తుంటారు.

తమాషా చేద్దామనిపించి పక్కనే ఉన్న పెద్ద మందార మొక్క వెనుక నిలబడి అక్కడకు శంకరం రాగానే హఠాత్తుగా "భౌ...వౌ.." అంటూ ముందుకి వచ్చాను.

శంకరం "అమ్మో..." అంటూ అరుస్తూ బాగా భయపడిపోయాడు! ఆ భయం చూస్తుంటే నాకు బాగా నవ్వొచ్చింది.

శంకరం కొంచెంగా వణుకుతున్నట్టుగా బెదురుగా చూస్తూ "మీరు..మీరు.." అని ఇక నోరు పెగలనట్లుగా ఆగిపోయాడు. "ఇంకా భయం తగ్గలేదా? ఎందుకలా చూస్తున్నావ్?" ఆశ్చర్యంగా అడిగాను.

"మీరు .. శ్రీలక్ష్మి.. అక్క.. కదూ.. అక్కా...నువ్వేనా..?" బెదురు చూపులతో అడిగాడు.

"ఏమిటి శంకరం శ్రీలక్ష్మి అంటున్నావ్? నేను.. సుజన.." అన్నాను చేయి పట్టుకుని.

రెండు నిమిషాలకి కొంచెం మామూలయ్యాడు గానీ పూర్తిగా బెదురు పోయినట్లు లేదు.

"అయితే మీరు సుజనా అక్కేనా?" నా వేపు పరికించి చూస్తూ అడిగాడు.

"ఏమయింది శంకరం .. ముందు ఇలా కూర్చో.." అంటూ నేను కూర్చొని తననీ నా పక్కనే కూర్చోబెట్టుకున్నాను.

తల మీద చేయి వేసి నిమురుతూ "ఇప్పుడు చెప్పు.. విషయం ఏమిటి?" అనడిగాను.

తలవొంచుకుని మౌనంగా కూర్చుండిపోయాడు. నేను మళ్ళీ మళ్ళీ అడిగేసరికి నోరు విప్పాడు.

"అక్కయ్యగారూ... మేం మొన్న ఈ ఊళ్ళోనే ఉన్న మా చిన్నతాతయ్య గారింటికి వెళ్ళాం. అపుడా మధ్య వాళ్ల పెద్దమ్మాయి రాజేశ్వరి చనిపోయింది లెండి. ఇప్పుడా రాజేశ్వరి వీళ్ళ చిన్నకోడలు కమలను ఆవహిస్తుందట!"

"ఆవహించడమేమిటి. వీళ్ళకావిషయం ఎలా తెలిసింది?"

"కమలక్క అప్పుడప్పుడు బిగుసుకుపోయినట్లుగా అయిపోయి.. 'నేను రాజేశ్వరిని వచ్చాను' అని చెబుతుంది. అప్పుడు వీళ్ళందరూ రాజేశ్వరితో మాట్లాడినట్లే మాట్లాడతారట! కాసేపటికి రాజేశ్వరి ఆత్మ వదిలివెళ్ళిపోగానే కమలక్క మామూలుగా అయిపోతుందట! అక్కయ్యగారూ మీరెప్పుడైనా అలా ఆత్మలతో మాట్లాడారా?" అడిగాడు.

"లేదు. ఇప్పుడు నీ ద్వారానే వింటున్నాను. అలా ఆత్మలు మనుష్యుల్ని ఆవహిస్తాయంటే నాకు నమ్మకం కుదరటం లేదు..." అన్నాను.

"అంటే .. ఆత్మలనేవి లేవంటారా?"

"నాకు తెలియని విషయం గురించి నేనేం చెప్పగలను! అవునూ.. నువ్వు శ్రీలక్ష్మి అక్క కదూ అని నన్నడిగావేం?"

కొంచెం సిగ్గుగా తలవొంచుకుని మెల్లగా చెప్పాడు. "వాళ్ళ రాజేశ్వరిలా శ్రీలక్ష్మి అక్క ఆత్మ మీ మీదకు వచ్చిందేమోననుకున్నాను.."

"ఎందుకలా అనుకున్నావ్?" ఆరా తీశాను.

శంకరం మొహంలోకి వెలుగొచ్చింది. "అక్క అచ్చం మీలానే ఇప్పుడు మీరు చేసినట్లే చేసి భయపెట్టేది! ఒకసారయితే అక్క గోడ చాటు నుండి వచ్చి అరిచేసరికి నేను భయపడిపోయి నా చేతిలో ఉన్న మూడు కూల్‌డ్రింకు సీసాల్నీ వదిలేశాను! ఇంకేముంది.. అన్నీ భళ్ళున పగిలి గోవిందా అయిపోయాయి!" అంటూ నవ్వాడు.

శ్రీలక్ష్మి ప్రసక్తి వచ్చేసరికి హుషారొచ్చినట్లుంది. మళ్ళీ మొదలు పెట్టాడు. "మీకు తెలీదు గానీ అక్క ఉన్నప్పుడు ఎంత సందడి చేసేదో! మా ఇంటికి వచ్చినప్పుడు నూతి గట్టు మీద కూర్చుని పిచ్చమ్మని.. అదేనండి ముత్యాల్ని.. ఇప్పుడు మీరలాగే పిలుస్తున్నారట కదా చెప్పింది... పాట పాడమని అక్క అడగటం ఆలశ్యం... ముత్యాలు మొదలు పెట్టేసేది! 'ఢం..ఢం.. డప్పు కొట్టరా..' లాంటి పాటల్ని పాడేటప్పుడు డాన్సు కూడా చేసేసేది! అప్పుడు డ్రైవరు సాంబడు గానీ ఉంటే ఏ పళ్ళెమో పట్టుకుని దరువేసేవాడు. ముత్యాలు ఆటకీ, పాటకీ అక్క ఎంత పెద్దగా నవ్వేదంటే 'పడిపోతావమ్మా జాగ్రత్త...' అంటూ మా బామ్మ భలే కంగారు పడిపోయేదిలెండి!"

ఒక్కసారిగా శంకరం మొహంలోకి దిగులు వచ్చేసింది. "అక్క చనిపోయినప్పుడు నేను రెండు రోజులు అన్నం తినలేకపోయాను..." అన్నాడు.

కళ్ళల్లోకి నీటి తెర కూడా వచ్చేసింది! నేను అనునయిస్తున్నట్లుగా చేయి పట్టుకున్నాను. అంతకన్నా చేయగలిగిందేముంది!

✻ ❀ ✻

ఆ మరునాడు దీపాల వేళకి పెళ్ళికూతురితో పెళ్ళికి వెళ్ళిన వాళ్లంతా తరలి వచ్చేశారు.

ఆరోజు ఉదయం నుండీ ఇంటిలోపలంతా పూల తోరణాలతో అలంకరించారు. శ్రీనిలయం పూల పరిమళాలతో గుమ్మెత్తిపోయింది.

నేను క్రిందకు దిగకుండా మెట్ల మధ్యలోనే నిలబడిపోయాను.

నీరజా వాళ్ళు ముందుగా లోపలకి వచ్చారు.

నీరజ హారతి పళ్ళెం పట్టుకుంది. వధూవరులిద్దరికీ హారతి ఇచ్చింది. పట్టుబట్టల్లో కృష్ణప్రసాద్, రజిత ఇద్దరూ ముచ్చటగా ఉన్నారు.

పేర్లు చెప్పమంటూ అందరూ ఏమిటో గల గలా మాట్లాడేస్తున్నారు.

"కృష్ణా ముందు నువ్వు చెప్పు.."

"అదేం ... అమ్మాయినే చెప్పమనండి.."

"అలా మెల్లగా చెబితే ఎవరికి వినిపిస్తుంది.."

ఎవరెవరో అలా గట్టి మాట్లాడుతుంటే.. నాకు అప్రయత్నంగా మేమిద్దరం శ్రీనిలయానికి వచ్చిన రోజు గుర్తుకు వచ్చింది.

ఆరోజు అత్తయ్య నిలబడిన చోటనే నేనిప్పుడు నిలబడ్డాను.

అప్పుడు నీరజ వెనక ఎవరో పక్కింటివాళ్ళు నలుగురైదుగురు ఉన్నారు. అత్తయ్య మొహంలో అప్పుడు ఏదో ఉదాశీనత.. నిష్ఠూరం!

ఇప్పుడు అత్తయ్య మొహంలో కొంచెంగా హుషారు, చిరునవ్వు ఉన్నాయి. గుమ్మానికి అటూ ఇటూ కూడా గుంపుగా చాలా మంది బంధువులు ఉన్నారు!

సరిగ్గా.. అప్పుడు అత్తయ్య అన్న విధంగానే నేనూ "పరిహాసాలు చాలు గానీ వాళ్ళను లోపలకి రానివ్వండి.." అని తీక్షణంగా అంటే..ఎలా ఉంటుంది అందరి రియాక్షను..?! నా ఆలోచనకి నవ్వొచ్చింది. వెను వెంటనే నిట్టూర్పు వచ్చింది!

"ఏంటమ్మాయ్.. నువ్వు చెబుతూంటే.. మా కెవరికీ వినిపించడం లేదు.." అని ఎవరో అన్నమాటలకి రజిత చాలా స్టైల్‌గా జుట్టును వెనక్కి తోసుకుంటూ, "అయితే మైకు తీసుకురండి.. ఇరుగూ పొరుగూ వాళ్ళకి కూడా వినబడేటట్లు చెబుతాను.." అంది.

అందరూ పెద్దగా నవ్వారు.

రజిత అందర్నీ తప్పించుకుని మెట్ల మీద నిలబడి ఉన్న నా దగ్గరకు వచ్చి చూపుడు వేలును నా వేపు ఉంచి చనువుగా "సుజన.. అవునా..?" అంది.

నేను అవునన్నట్లుగా తలవూపగానే "చూశావా.. ఇంతకు మునుపు చూడకపోయినా ఎలా గుర్తుపట్టానో..." అంటూ జుట్టు వెనక్కి తోసుకుని భుజాలెగురేసింది.

అంత చనువుగా పలుకరించినందుకు చాలా ఆనందంగా అనిపించింది. చిరునవ్వుతో చూస్తూ తన చేయి పట్టుకున్నాను.

తన అక్క మరణానికి నేనే కారణమనుకుని అందరిలా దూరంగా, నిష్ఠూరంగా ఉంటుందని అనుకున్నాను. నా అంచనా తప్పింది.

"పెళ్ళికి ఎందుకు రాలేదు? ఇక్కడ ఏర్పాట్లు ఎవరో ఒకరు చూడరా..? నువ్వే ఉండాలా? ఇదేం బాగా లేదు.." అంది.

ఊహించని ఆ ఆదరానికి ఒక్క క్షణం నిశ్చేష్ఠురాలినైపోయి.. తన వేపు ఇష్టంగా, చిరునవ్వుతో చూస్తుండిపోయాను. జవాబేం చెప్పాలో తోచలేదు.

రజిత నవ్వులో ఒక విధమైన స్టైలు ఉంది. పెదవుల్ని ఒక వేపుకి సాగదీసినట్లుగా నవ్వుతుంది.

"నువ్వు వచ్చి ఉంటే.. వైభవంగా జరిగే పెళ్లి ఎలా ఉంటుందో నీకు తెలిసేది!" అని విచారిస్తూ మొహం పెట్టి.. "ప్చ్" అంది.

షాకయ్యాను.

కుటుంబ సభ్యురాలిగా పెళ్ళి వేడుకలో పాలు పంచుకోనందుకు కాదు రజిత విచారం, స్థితిమంతుల పెళ్ళి ఎలా ఉంటుందో తెలుసుకునే అవకాశాన్ని పోగొట్టుకున్నందుకు మాత్రమే! నిట్టూర్చాను. ఏమో.. తను యధాలాపంగానే అలా అందేమో... నేనే ఇంకో విధంగా ఆలోచిస్తున్నానేమో...

* ❀ *